క్లుప్తంగా

ఉరేసుకుని ఆత్మహత్య

జ్యోతినగర్(రామగుండం): మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎన్టీపీసీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. న్యూపోరట్‌పల్లి మేరకాలనీకి చెందిన బుట్టి వేణు (33) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొద్ది నెలలుగా మద్యానికి బానిసై సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గమనించి చూసే సరికే మృతి చెందాడు.మృతుడికి భార్య స్వర్ణతో పాటు ముగ్గురు పిల్లలున్నారు. మృతుడి తండ్రి బీమయ్య ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని ఎన్టీపీసీ పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పెద్దబొంకూర్‌లో మరో వ్యక్తి..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్‌కు చెందిన ఎనగందుల సంజీవరాజు (46) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సంజీవరాజు మద్యానికి బానిసై అదే మత్తులో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని ఏఎస్సై రామస్వామి తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

టీచింగ్ పోస్టు ఖాళీ

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారు సైనిక్ శిక్షణ గురుకుల విద్యాలయంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఎన్‌డీఏ సోషల్ స్టడీస్ బోధించుటకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 18న జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ లచ్చయ్య కోరారు. ఎంఏ బీఈడీ, పదేళ్ల అనుభవం కలిగిన అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూకి హాజరు కావాలని, డెమో నిర్వహించి ఎంపిక చేస్తామని, ఎంపికైన అభ్యర్థికి నెలకి రూ.50 వేల పారితోషికం ఉంటుందన్నారు.

ఆరుగురి బైండోవర్

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆరుగురిని తహసీల్దార్ డి.పుష్పలత ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. ఇసుక అక్రమ రవాణ చేస్తున్న మాన్వాడకు చెందిన కొమురయ్య, సంతోష్, ప్రసాద్, బోయినపల్లికి చెందిన ప్రభాకర్, తరచూ భూముల విషయంలో గొడవలు పడుతున్న బూర్గుపల్లికి చెందిన శ్రీనివాస్, మల్లేశంను బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

పోలీసుల విధులకు ఆటంకం

జమ్మికుంట: పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ఐదుగురిపై కేసు నమోదు, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ వరగంటి రవి మంగళవారం తెలిపారు. మండలంలోని మానేరు పరివాహక ప్రాంతం విలాసాగర్ వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్లను విలాసాగర్ గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా తీసుకువెళ్లారు. వారిని గుర్తించి కేసు నమోదు, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ వివరించారు.

నృసింహుని బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు



ధర్మపురిలో ఏర్పాటు చేస్తున్న స్వాగత తోరణాలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

- 20 నుంచి వచ్చేనెల ఒకటో తేదీ వరకు..
- ధర్మపురిలో కొనసాగుతున్న పనులు

ధర్మపురి: ధర్మపురి నృసింహుడి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈనెల 20నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలకు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాలతోపాటు నిజామాబాద్, నిర్మల్, ఆర్మూర్ జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. వారికి సరిపడా కల్పించాల్సిన వసతులపై ఆలయ అధికారులు శాఖల వారీగా ప్రణాళిక రూపొందించుకున్నారు.

అధికారుల పక్కా ప్రణాళిక

బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాలు, రాజగోపురాలు, బ్రహ్మపుష్కరిణి వద్ద, గోదావరిలో చలువ పందిళ్లు, స్త్రీలు బట్టలు మార్చుకునేందుకు తడకలతో డ్రెస్సింగ్ రూంలు, షెడ్లు, తాగునీటి వసతి కల్పిస్తున్నారు. ముఖ్యంగా వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే భక్తుల కోసం పోస్టర్లు, కరపత్రాలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు ముద్రించి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

- ఆలయాలు, రాజగోపురాలు, స్వాగత తోరణాలకు రంగురంగుల విద్యుదీపాలంకరణకు చర్యలు తీసుకుంటున్నారు.
- బ్రహ్మపుష్కరిణి (కోనేరు)లో పాతనీటిని తొలగించి కొత్త నీటిని నింపుతున్నారు.
- కోనేరులోని చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నారు.
- భక్తులకు ఆలయం తరఫున, స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో ఆలయంతోపాటు గోదావరి తీర ప్రాంతాల్లో చలివేంద్రాలు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయనున్నారు.
- అన్నదానం కోసం రైసుమిల్లర్లు, ఆర్యవైశ్యులు, వర్తక సంఘం, ఇతర దాతల సహకారం తీసుకుంటున్నారు.
- జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సుమారు 400 మంది పోలీస్ బందోబస్తుకు చర్యలు చేపడుతున్నారు.
- వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలను పరిశీలిస్తున్నారు.
- స్వామివారి కల్యాణానికి ఆలయంలో స్థలం ఇరుకుగా ఉన్నందున మరోచోట చేయించడానికి చర్యలు చేపడుతున్నారు.
- భక్తుల భద్రత నిమిత్తం ఆలయం, గోదావరి తీరప్రాంతం, బస్టాండ్ ఏరియా, ప్రధాన కూడళ్లలో దేవస్థానం, పోలీస్ సంయుక్త పర్యవేక్షణలో 60వరకు సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తున్నారు.

నేటి నుంచి 'దానాపూర్' సేవలు



జమ్మికుంట రైల్వే స్టేషన్

- అందుబాటులోకి మెరుగైన ప్రయాణ సాకర్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న వ్యాపారులు, ప్రయాణికులు

జమ్మికుంట(హుజూరాబాద్): ప్రముఖ వ్యాపార కేంద్రం జమ్మికుంట పట్టణంలోని రైల్వే స్టేషన్ సాంకేతికత పరిజ్ఞానంతో రూపుదిద్దుకుంది. ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌తో ఇక్కడి నుంచి రోజూ కాగజ్‌నగర్, నాగపూర్, రామగుండం, హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే వ్యాపారులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి రానుంది. ముఖ్యంగా కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు గతంలో ఉదయం సమయాల్లో భాగ్యనగర్ రైలు రోజులో ఒక్కటి మాత్రమే ఉండేది. సూమారు 14గంటల తర్వాత అదే రైలులో ప్రయాణం చేయాల్సి వచ్చేది. కాగా, దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌కు జమ్మికుంటలో హాల్టింగ్ కల్పించడంతో ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా ఉండనుంది.

సికింద్రాబాద్ టూ దానాపూర్..

బుధవారం నుంచి జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్‌తో సేవలు ప్రారంభంకానున్నాయి. దేశవ్యాప్తంగా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. సికింద్రాబాద్ టూ బిహార్ రాష్ట్రంలోని దానాపూర్ రైల్వేస్టేషన్ వరకు దానాపూర్ ఎక్స్‌ప్రెస్ నడవనుండగా, జమ్మికుంటలో రోజూ ఉదయం 11.39 గంటలకు హాల్టింగ్ ఉంటుంది. తిరిగి దానాపూర్ రైల్వే స్టేషన్ టూ సికింద్రాబాద్ వెళ్లే క్రమంలో జమ్మికుంట స్టేషన్‌లో రోజూ సాయంత్రం 5.24 గంటలకు హాల్టింగ్ ఉండనున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు.

రూ.21 కోట్లతో అభివృద్ధి పనులు

కేంద్ర ప్రభుత్వ నిధులతో జమ్మికుంట స్టేషన్‌లో ఆధునిక వసతులు కల్పించారు. రూ.10 కోట్లతో మూడో లైన్, రూ.11 కోట్లతో సిగ్నల్ టెక్నాలజీ, అత్యాధునిక స్టేషన్ మేనేజర్ రూమ్, టెలీ కమ్యూనికేషన్ సిస్టం, సీసీ కెమెరాలు, డిజిటల్ డిస్‌ప్లే, కోచ్ డిస్‌ప్లే బోర్డు, రైల్వే స్టేషన్ ప్రాంగణంలో తారు రోడ్డు, గార్డెనింగ్, ప్లాట్ ఫామ్స్, బారికేడ్లు తదితర సౌకర్యాలు కల్పించారు. అలాగే బల్లార్ష నుంచి కాజీపేట వరకు మూడోలైన్ పనులు పూర్తయ్యాయి. దీంతో తక్కువ సమయంలో ఎక్కువ రైళ్ల రాకపోకలు సాగించే వీలుంటుంది.

వినియోగించుకోవాలి



జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు ఈ నెల 13 నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలి.

– పి.చంద్రమౌళి, రైల్వే స్టేషన్ మేనేజర్, జమ్మికుంట

ఎంపీ సంజయ్ కృషితో..



జమ్మికుంట స్టేషన్‌లో దానాపూర్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ ఉండేలా చూడాలని స్థానిక వ్యాపారులు ఎంపీ బండి సంజ య్‌కుమార్‌కు విన్నవించారు. దీంతో కేంద్ర మంత్రితో ఎంపీ మాట్లాడి హా ల్టింగ్ కోసం కృషి చేశారు. ఎంపీకి ప్రత్యేక కృతజ్ఞతలు.

– జీడి మల్లేశ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు, జమ్మికుంట

సింగరేణిలో భారీగా అధికారుల బదిలీలు

గోదావరిఖని: సింగరేణి సంస్థలో 20 మంది మైనింగ్ అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు సీఆర్‌పీ/పీఈఆర్/సీ/26/775పేరున మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అధికారి పేరు	హోదా	ప్రస్తుతం బదిలీ
హబీబ్‌హుస్సేన్	జీఎం(క్వాలిటీ)	ఓఎస్‌డీ, భూపాల్‌పల్లి
డి.రాంచందర్	జీఎం,మణుగూరు	సీఎండీ,హైదరాబాద్
కేహెచ్‌ఎస్‌గుప్తా	జీఎం,బెల్లంపల్లి	సేఫ్టీ,రామగుండం
డి.లలిత్‌కుమార్	జీఎం, కొత్తగూడెం	జీఎం,మణుగూరు
కె.రఘుకుమార్	ఏజీఎం,రామగుండం	సేఫ్టీ,బెల్లంపల్లి రీజియన్
బండి వెంకటయ్య	ఏజీఎం,భూపాల్‌పల్లి	ఎస్టేట్, కార్పొరేట్
వి.కృష్ణయ్య	ఏజీఎం, మణుగూరు	హెచ్‌ఆర్‌డీ,జీఎం
శీలం కవీంద్ర	డీవైజీఎం,భూపాల్‌పల్లి	ఎస్‌వోటూజీఎం,భూపాల్‌పల్లి
ఎస్.వెంకటాచారి	డీవైజీఎంపీవో,జీవీఆర్	ఎస్టేట్, కార్పొరేట్
ఎన్‌వీఆర్‌ప్రహల్లాద్	డీవైజీఎం పీఓ, కోయగూడెం	పీవో,జీవీఆర్,ఓసీపీ
వి.శ్రీనివాస్‌రావు	డీవైజీఎం,ప్రాజెక్టుఅండ్‌ప్లానింగ్	పీవో,కోయగూడెం
ఎస్.వెంకటేశ్వర్‌రావు	డీవైజీఎం ఏవో, కేటీకే–8	ఎస్‌ఓటూజీఎం,ఆర్జీ–2
వి.భిక్షమయ్య	డీవైజీఎం,కేటీకే–2,ఓసీపీ	ఏవో,కేటీకే–8
బి.కృష్ణప్రసాద్	ఎస్‌వోఎం,ఎన్విరాన్,భూపాల్‌పల్లి	మేనేజర్,కేటీకే–2
ఎన్.భూశంకరయ్య	ఎస్‌వోఎం,కేటీకే–5	కాసిపేట్–1
షేక్ అల్లావుద్దీన్	కా.మేనేజర్ కాసిపేట్–1	కేకే–5
బి.మల్లేశం	అ.మేనేజర్,జీడీకే–11	జీవీఆర్,ఓసీ–2
జి.దుర్గాప్రసాద్‌రావు	అ.మేనేజర్,జీవీఆర్‌ఓసీ–2	ఆర్‌అండ్‌డీ,కార్పొరేట్
ప్రసాద్	అ.మేనేజర్,ప్రాజెక్టుఅండ్‌ప్లానింగ్	జీడీకే–11
టి.పోషమల్లు	అ.మేనేజర్,కార్పొరేట్	ఎన్విరాన్, భూపాల్‌పల్లి

'వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్' స్టాల్ ప్రారంభం



వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ

పెద్దపల్లిరూరల్/రామగుండం: అమృత్ భారత్ రైల్వేస్టేషన్లలో ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలందించడంలో భాగంగా మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో పలు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పెద్దపల్లి, రామగుండం రైల్వే స్టేషన్‌లలో ఏర్పాటు చేసిన వన్‌స్టేషన్ వన్ ప్రాడక్ట్ స్టాళ్లను, రాఘవాపూర్‌లో ఏర్పాటు చేసిన షెడ్, సుల్తానాబాద్‌లో పీఎంగతిశక్తి కార్గో టెర్మినల్‌ను ప్రారంభించారు.రైల్వే వ్యవస్థను అన్ని విధాల అభివృద్ధి చేయడం ద్వారా సామాజిక, ఆర్థికాభ్యున్నతి సాధించామని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. పెద్దపల్లి జంక్షన్ రైల్వేస్టేషన్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్‌తో పాటు బీజేపీ నాయకులు కొంతం శ్రీనివాసరెడ్డి, వెల్లంపల్లి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సురేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. రామగుండంలో కార్పొరేటర్ సతీశ్‌కుమార్, జెడ్పీటీసీ సంధ్యారాణి, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, అధికారులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అభివృద్ధికి కేంద్రం ప్రాధాన్యం

- వీసీలో ప్రధాని మోదీ
- కరీంనగర్ స్టేషన్‌లో వన్ స్టేషన్–వన్ ప్రొడక్ట్ స్టాల్ ప్రారంభం



స్టాల్‌ను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న పీఎం మోదీ

కరీంనగర్‌రూరల్: దేశంలో రైల్వే అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతం ఇస్తోందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. మంగళవారం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశవ్యాప్తంగా రూ.85 కోట్ల విలువైన రైల్వే ఆధునీకరణ పనులతోపాటు కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో వన్ స్టేషన్–వన్ ప్రొడక్ట్ స్టాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రైల్వేస్టేషన్లను కేంద్రం ఆధునీకరిస్తోందన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం బుల్లెట్, వందే భారత్ రైళ్లను తీసుకొచ్చిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని తెలిపారు. వన్ స్టేషన్–వన్ ప్రొడక్ట్ స్టాల్స్ ద్వారా స్థానిక ఉత్పత్తులను విక్రయించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. స్టేషన్ మేనేజర్ రవీందర్, ఏడీ సమీర్‌కుమార్, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ విష్ణు, కమర్షియల్ సూపర్‌వైజర్ సమ్మయ్య, టీసీ తిరుపతి, రైల్వే హమాలీ సంఘం ప్రతినిధులు కాశెట్టి లక్ష్మణ్, తోట తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: వివిధ ప్రైవేట్ బ్యాంకుల్లో ఉద్యోగాల కల్పనకు హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్, ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో రెండు నెలల ఉచిత శిక్షణకు అర్హులైన నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఏదేని డిసిప్లిన్‌లో డిగ్రీ ఉత్తీర్ణులైన 26 ఏళ్లలోపు యువతీ, యువకులు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి 25 లోపు www.tsbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 31న ఉమ్మడి కరీంనగర్‌లో స్క్రీనింగ్ టెస్టు నిర్వహించి మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 08723223004 లేదా 93818 88746 నంబర్‌లో సంప్రదించాలని ఆ ప్రకటనలో సూచించారు.

డీఎస్సీ, ఎస్జీటీ కోసం ఉచిత శిక్షణ

సిరిసిల్లకల్చరల్: జిల్లాలోని బీసీ స్టడీ సర్కిల్ ద్వారా రాబోయే డీఎస్సీలో ఎస్‌జీటీ పరీక్ష కోసం అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నట్లు సర్కిల్ డైరెక్టర్ వెంకటస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 వరకు www.tsbcstudycircle. cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5లక్షల లోపు ఉండాలన్నారు. ఇంటర్మీడియట్, డైట్, టెట్ పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా శిక్షణార్థులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఎంపికైన వారికి నిపుణులైన అధ్యాపకులచే శిక్షణతో పాటు వారంత పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 93818 88746 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎన్‌హెచ్‌ఎం పోస్టులకు రూ.3 లక్షలు?



దరఖాస్తులు అందిస్తున్న అభ్యర్థులు (ఫైల్)

- వైద్యారోగ్య శాఖ ఉద్యోగుల బేరసారాలు!
- అభ్యర్థుల్లో ఆందోళన
- పైరవీలకు తావులేదంటున్న అధికారులు
- జిల్లాలో 45 పోస్టులకు 1,780 దరఖాస్తులు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) కింద వైద్యారోగ్య శాఖలో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు ఇటీవల నోటిఫికేషన్ జారీ చేశారు. 8 విభాగాల్లో 45 పోస్టులకు ఏకంగా 1,780 దరఖాస్తులు వచ్చాయి. 4 వైద్యాధికారి పోస్టులకు 13, 21 స్టాఫ్‌నర్సు పోస్టులకు 821, 13 ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు 216, ఒక ప్రోగ్రాం అధికారి పోస్టుకు 51, ఒక ఏఎస్‌ఎం పోస్టుకు 216, 3 ఫార్మసిస్టు పోస్టులకు 298, ఒక డీఈవో పోస్టుకు 154, ఒక ఆప్తోమెట్రిక్ పోస్టుకు 11 మంది అర్జీ పెట్టుకున్నారు.

మెరిట్ అభ్యర్థుల లిస్టు తీసుకొని..

ఎన్‌హెచ్‌ఎం కింద జరిగే నియామకాలను ఎలాంటి రాత పరీక్ష లేకుండా మెరిట్ ఆధారంగా చేపడుతున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. దరఖాస్తుల గడువు ఈ నెల 2తో ముగిసిన వెంటనే వైద్యారోగ్య శాఖలో పనిచేసే కొంత మంది ఉద్యోగులు చేతివాటం ప్రదర్శనకు తెరలేపినట్లు తెలిసింది. దరఖాస్తు చేసుకున్నవారిలో మెరిట్ అభ్యర్థుల లిస్టు తీసుకొని, మధ్యవర్తుల సహకారంతో వారిని మభ్యపెట్టే పనిలో పడినట్లు సమాచారం. ఎన్‌హెచ్‌ఎం కింద కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తున్న ఈ పోస్టులు భవిష్యత్తులో రెగ్యులరైజ్ అయ్యే అవకాశం ఉందని ఆశ చూపుతూ.. రూ.2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు ఖర్చవుతుందని బేరసారాలకు దిగుతున్నట్లు తెలిసింది. దీంతో ఇప్పటివరకు మెరిట్ ప్రకారమే పోస్టుల భర్తీ జరుగుతుందని భావించిన అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది.

కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగాలకు పైరవీలు కొనసాగుతున్నాయన్న ప్రచారంతో చాలామంది వైద్యారోగ్య శాఖలో పని చేస్తున్న తమ సన్నిహితులు, బంధువులు, ఇతర తెలిసిన వారితో పైరవీల గురించి మాట్లాడే పనిలో పడ్డారు. ఎవరిని కలిస్తే పని అవుతుంది.. ఎవరి ద్వారా కలవాలంటూ ఆరా తీస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఈ పోస్టులన్నీ కలెక్టర్ నేతృత్వంలో పారదర్శకంగా భర్తీ చేస్తామని అధికారులు చెబుతున్నారు. డబ్బులున్నవారు పైరవీకారుల కోసం ప్రయత్నిస్తుండగా పేద, మధ్యతరగతి అభ్యర్థులు మాత్రం ఆవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, పోస్టుల భర్తీలో అవకతవకలకు చోటు లేకుండా చూడాలని కోరుతున్నారు.

బ్రోకర్లను నమ్మి మోసపోవద్దు

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగాల భర్తీ పూర్తి పారదర్శకంగా జరుగుతుంది. కలెక్టర్ ఆదేశాల మేరకు కమిటీ ఏర్పాటు చేసి, దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాత మెరిట్ ప్రకారం ఉద్యోగాలు ఇస్తాం. ఇందులో ఎలాంటి పైరవీలకు తావులేదు. బ్రోకర్లను నమ్మి మోసపోవద్దు.

– డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో

కష్టాల కడలి.. కన్నీటి మజిలీ

- చిన్ననాడు తండ్రి.. నేడు భర్త మృతి
- దిక్కుతోచని స్థితిలో మహిళ
- దాతల సాయం కోసం వేడుకోలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): చిన్నతనంలోనే తండ్రి చనిపోతే.. కష్టాలను ఈదుకొని పెద్దయ్యింది. పెళ్లి అయి ఆనందంగా ఉందామనుకునే వయసులో భర్త మృతితో మళ్లీ కష్టాలు చుట్టుముట్టాయని ఆ మహిళ రోదిస్తుంది. ఒక కూతురు, తను ఒంటరి వారయ్యామని.. కుటుంబ పెద్దదిక్కు మృతిచెందడంతో రోడ్డున పడ్డామని ఆవేదన చెందుతుంది. ఆర్థికంగా చితికిపోయిన తమ కుటుంబాన్ని దాతలు ఆదుకోవాలని వేడుకుంటుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన రేణిగుంట రామస్వామి–స్వరూప దంపతులకు ఇద్దరు కూతుళ్లు నీలిమ, శ్వేత. ఇరువై ఏళ్ల క్రితం రామస్వామి అనారోగ్యంతో మృతిచెందగా కూతుళ్లను ఆ తల్లి పెంచి పోషించింది. పెద్ద కూతురు నీలిమ వివాహానికి డబ్బులు లేకపోవడంతో వారి కులసంఘం(మేర) ప్రతినిధులు చందాలు వేసి బండలింగంపల్లికి చెందిన వెన్ను దేవేందర్‌తో పెళ్లి జరిపించారు. చిన్న కూతురు శ్వేతను దేవేందర్ సోదరుడు శ్రీనివాస్ 11 ఏళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. హైదరాబాదులో ఓ ప్రైవేట్ కంపెనీలో మార్కెటింగ్ చేస్తూ బతుకుతున్న శ్రీనివాస్‌కు ఓ కూతురు రేష్మ(10) జన్మించింది. ఏడేళ్ల క్రితం శ్వేత తల్లి స్వరూప అనారోగ్యంతో మృతి చెందింది. కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న శ్రీనివాస్ ఐదు రోజుల క్రితం హైదరాబాద్‌లో అద్దె ఇంటిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని స్వగ్రామం బండలింగంపల్లికి తీసుకురాగా గ్రామస్తులు చందాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అప్పటి వరకు కష్టమంటే తెలియకుండా పోషించిన భర్త దూరమవడంతో భవిష్యత్‌ను తలుచుకొని భార్య శ్వేత దీనంగా రోదిస్తుంది. బాధిత కుటుంబానికి దాతలు సాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. సాయం చేయాలనుకున్నవారు ఫోన్ పే నంబర్ 95819 00554లో పంపాలని కోరారు.



దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్న తల్లీకూతురు

కాంగ్రెస్ పథకాలతో అందరిలో సంతోషం

- ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్



గృహజ్యోతి పథకం ప్రారంభిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: రాష్ట్రంలో కృత్రిమ కరువు సృష్టించాలని బావబామ్మర్దులు కేటీఆర్, హరీశ్‌రావు చూస్తున్నారని, మేడిగడ్డ కుంగుబాటు గత ప్రభుత్వ డొల్లతనానికి నిదర్శనమని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని అనుపురం, తేట్టకుంట, చీర్లవంచ గ్రామాల్లో గృహజ్యోతి పథకం ప్రారంభించి, పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారన్నారు. ఇటీవల కేటీఆర్, హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ వచ్చింది, కరువు వచ్చిందని అనడం చూస్తే అసలు వారికి బుద్ధి ఉండే మాట్లాడుతున్నారా అని అనిపిస్తుందన్నారు. ఎన్నికల కంటే ముందే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందని రిపోర్టు రాగానే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆగమేఘాల మీద తమ లోటుపాట్లు ఎక్కడ బయటపడుతాయోనని భయపడి అందులోని నీటిని సముద్రంలోకి వదిలేశారన్నారు. అప్పటి సీఎం కేసీఆర్ తానే అపర భగీరథుడనని, ఇంజినీర్ అని గొప్పలు చెప్పి లక్ష కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, ఎంపీటీసీ రాజశేఖర్, నాయకులు ఎర్రం రాజు, సత్తయ్య, ఆగయ్య, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కథలాపూర్(వేములవాడ):మండలంలోని దుంపేట శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన బత్తుల రామకృష్ణ (33) మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. రామకృష్ణ కొద్దిరోజులుగా మండలకేంద్రంలో నివాసముంటూ చింతకుంటలో సెంట్రింగ్ పనులు చేస్తున్నాడు. సోమవారం రాత్రి చింతకుంట నుంచి కథలాపూర్‌కు బైక్‌పై వెళ్తుండగా.. దుంపేట శివారులో అదుపుతప్పి పడిపోయాడు. తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బావమరిది బండారు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే ఆత్మహత్యలు

సిరిసిల్లటౌన్: గతంలో పాలించిన బీఆర్ఎస్, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీరుతోనే నేత కార్మికులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆరోపించారు. మంగళవారం పార్టీ ఆఫీసులో మాట్లాడారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఆర్డర్లు ఇవ్వడంలో నేటి సర్కారు నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు 50 శాతం సబ్సిడీ అందించారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం సిరిసిల్ల మ్యాక్స్ సంఘాలు, ఎస్ఎస్ఐ యూనిట్లను ఇండస్ట్రీయల్ కేటగిరీగా మార్చి ఎత్తివేయాలని చూసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమవర్గాలతో చర్చించి తగు సహాయ చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే కేటీఆర్‌కు నేత కార్మికులపై ఏమాత్రం ప్రేమ ఉన్నా సీఎం అపాయింట్‌మెంట్ తీసుకుని అన్ని వర్గాలతో చర్చలు జరిపించేలా కృషి చేయాలని సూచించారు. ఆత్మహత్యకు పాల్పడిన శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. నాయకులు పంతం రవి, సోమ నాగరాజు, కడారి రాములు, అజ్జ వేణు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుంటి వేణు

సాక్షి రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 12 । మార్చి । 2024



ఘనంగా మహిళా దినోత్సవం

సిరిసిల్లటౌన్: మున్సిపల్ ఆధ్వర్యంలో సినారె కళామందిరంలో సోమవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళ : 6:31	బుధ 5:05

గరిష్టం/కనిష్టం 36.0/25.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

దాహార్తి తీర్చడం అభినందనీయం



వేములవాడ: కోర్టుకు వచ్చే కక్షిదారులు, అడ్వకేట్లు, పోలీసు సిబ్బంది తదితరులకు దాహార్తి తీర్చేందుకు అడ్వకేట్ అసోసియేషన్ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని జడ్జీలు సట్టు రవీందర్, జ్యోతిర్మయి పేర్కొన్నారు. కోర్టు ఆవరణలో సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంట రాజు, కార్యదర్శి నక్క దివాకర్, ఏజీపీ గుడిసె సదానందం, పీపీ విక్రాంత్, అడ్వకేట్లు నాగుల సత్యనారాయణ, నేరెళ్ల తిరుమల్ గౌడ్, చెర్ల ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడికి సన్మానం



సిరిసిల్ల: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం కేంద్ర సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మారం జగదీశ్వర్‌ను సోమవారం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎలుసాని ప్రవీణ్‌కుమార్, గాజుల సుదర్శనం సన్మానించారు. హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి పాటుపడాలని కోరారు.

బాధ్యతగా ఓటేయాలి



సిరిసిల్లక్రైం: ఎన్నికల్లో బాధ్యతగా ఓటేయాలని డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. సిరిసిల్లలో సోమవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సిరిసిల్లటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి గాంధీ, అంబేద్కర్‌చౌక్ మీదుగా ఫ్లాగ్ మార్చ్ కొనసాగింది. సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి, సాయుధ బలగాలు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి సీసీరోడ్ల నిర్మాణానికి ఎంపీ బండి సంజయ్‌కుమార్ రూ.12లక్షలు మంజూరు చేయగా.. ఆ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. బండి సంజయ్‌ని గెలిపించుకుంటే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నంది కిషన్, నాయకులు చందుపట్ల లక్ష్మారెడ్డి, రాజిరెడ్డి, బందారపు లక్ష్మారెడ్డి, కంచర్ల పర్శరాములు, దేవారెడ్డి పాల్గొన్నారు.

పని లేక పొట్టకెళ్తలేదు



ఇతను చిందం అశోక్. సిరిసిల్లలోని నెహ్రూనగర్‌కు చెందిన అశోక్ పవర్‌లూమ్ కార్మికుడు. నిత్యం 12 గంటలు సాంచాల మధ్య పనిచేసి పాలిస్టర్ బట్టను ఉత్పత్తి చేస్తే వారానికి రూ.1,500 నుంచి రూ.2వేలు వస్తాయి. అదే బతుకమ్మ చీరలు నడిపితే వారానికి రూ.2,500 నుంచి రూ.3,500 వస్తాయి. నెల రోజులుగా సిరిసిల్లలో సాంచాలు బంద్ పడడంతో పని లేక కష్టంగా ఉంది. భార్య బీడీలు చేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తుంది.



ఇతను గాలి రమేశ్. తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులోని కేసీఆర్ నగర్‌లో నివాసం ఉంటాడు. వార్పర్‌గా బీములు పోస్తాడు. నెలకు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు వస్తాయి. డిసెంబరు నుంచి పనిలేక ఇబ్బందులు పడుతున్నాడు. కొడుకు బీటెక్ చదువుతుండగా.. అతని హాస్టల్ ఫీజుకు డబ్బులు లేక అప్పులు చేయాల్సి వస్తుందని రమేశ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



ఇతను నరాల లక్ష్మణ్. జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్. లక్ష్మణ్ 10 సాంచాలపై పాలిస్టర్ బట్టను ఉత్పత్తి చేస్తూ వారానికి రూ.2 వేలు సంపాదిస్తాడు. అదే బతుకమ్మ చీరల బట్ట అయితే.. ఆరు సాంచాలపై పనిచేస్తూ వారానికి రూ.4వేలు సంపాదించేవాడు. కానీ నెల రోజులుగా ఎలాంటి పని లేక అప్పుల పాలవుతున్నారు. ప్రభుత్వ ఆర్డర్లు వస్తే.. సిరిసిల్ల నేతన్నలకు పని దొరుకుతుందని లక్ష్మణ్ చెబుతున్నారు.

- సాంచాలన్నీ బంద్
- నెల రోజులుగా పని లేదు
- సిరిసిల్ల నేతన్నల ఆవేదన
- ఆసాములదీ అదే తీరు..



పవర్‌లూమ్ కార్మికుల ప్రదర్శన



సిరిసిల్ల పోలీస్‌స్టేషన్ ముందు కార్మికుల ధర్నా

సిరిసిల్ల: వస్త్రోత్పత్తి ఖిల్లా సిరిసిల్లలో పనిలేక కార్మికులు పస్తులుండే పరిస్థితులు ఏర్పడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వకపోవడం, గతంలోని రూ.200 కోట్ల బకాయిలు చెల్లించకపోవడంతో సాంచాలు బంద్ పడ్డాయి. యజమానులు పాలిస్టర్ బీములు పోయించకుండా.. ఆసాములకు ఇవ్వకుండా.. చేతులెత్తేశారు. ఫలితంగా కార్మికులు, ఆసాములకు పని లేకుండా పోయింది. సిరిసిల్లలో 27 వేల మగ్గాలు ఉంటే.. ఇప్పుడు 20వేల మగ్గాలపై వస్త్రోత్పత్తి నిలిచిపోయింది.

దయనీయంగా కార్మికుల పరిస్థితి

సిరిసిల్లలో అట్టడుగున ఉండే కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉంది. సాంచాలు బంద్ పడడంతో కార్మికులకు పని లేక ఆర్థిక పరిస్థితి దారుణంగా మారింది. రోజువారి ఖర్చులకు సైతం డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారు. యజమానులు, ఆసాముల పరిస్థితి కాస్త మెరుగ్గా ఉండగా.. సాంచాల మధ్య పనిచేసే కార్మికుల ఇల్లు గడవక, పొట్టకు ఎల్లక దయనీయ పరిస్థితుల్లో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించి ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్లను సిరిసిల్ల నేతన్నలకు అందించాల్సిన అవసరం ఉంది.

రాస్తారోకోలు.. ధర్నాలు

కార్మిక క్షేత్రంలో సోమవారం రాస్తారోకోలు, ధర్నాలు జరిగాయి. ఉపాధి కల్పించాలనే ఏకైక డిమాండ్‌తో అటు కార్మికులు సిరిసిల్ల అంబేడ్కర్ సర్కిల్‌లో రాస్తారోకో చేయగా.. ఇటు ఆసాములు కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు. రెండు వర్గాలు వేర్వేరుగా ఆందోళనలు చేసినా, ఇద్దరి డిమాండ్ ఒక్కటే.. కార్మికులకు పని కల్పించాలని, ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని. సిరిసిల్ల వస్త్రపరిశ్రమను బతికించేందుకు ప్రభుత్వం వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇవ్వాలని నేతన్నలు కోరుతున్నారు.

విన్నపాలు వినవలే..

- ప్రజావాణికి తరలివచ్చిన ప్రజలు
- అర్జీలు స్వీకరించిన అడిషనల్ కలెక్టర్లు గౌతమి, ఖీమ్యానాయక్
- వివిధ సమస్యలపై 39 దరఖాస్తులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్లు

సిరిసిల్లటౌన్: స్థానికంగా అధికారులు పట్టించుకోకుండా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉంటున్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు ప్రజావాణిలో మొరపెట్టుకున్నారు. అడిషనల్ కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే దరఖాస్తులు, ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చే అర్జీలలో ఒక్కటి కూడా పెండింగ్‌లో ఉండొద్దని సూచించారు. సమస్య పరిష్కారం కాకుంటే ఎందుకు కాలేదో అర్జీదారునికి లిఖిత పూర్వకంగా అందివ్వాలని సూచించారు. వివిధ సమస్యలపై 50 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ 23, సిరిసిల్ల మున్సిపల్ ఆఫీస్‌కు 14, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆఫీస్‌కు 3, చందుర్తి, కోనరావుపేట తంగళ్లపల్లి ఎంపీడీవోలకు, ఎంప్లాయిమెంట్, డిస్ట్రిక్ట్ సర్వే, డీఆర్‌డీవో, టౌన్‌ప్లానింగ్ కార్యాలయాలకు ఒక్కో దరఖాస్తు వచ్చాయి. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్, జెడ్పీ సీఈవో ఉమారాణి, డీఆర్డీవో శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

హెల్ప్‌డెస్క్ ఏర్పాటు



కలెక్టరేట్‌లో దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ కోసం ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. జిల్లా సంక్షేమశాఖ సిబ్బంది హెల్ప్‌డెస్క్‌లో అందుబాటులో ఉండి బాధితులకు సేవలందించారు. ప్రజావాణికి వచ్చే వృద్ధులు, దివ్యాంగులను వీల్‌చైర్స్‌లో కూర్చోబెట్టి దరఖాస్తులు అందించేలా చర్యలు చేపట్టారు.

ఆలయ భూమిని రక్షించాలి



శాంతినగర్ శివారులోని విశ్వనాథస్వామి ఆలయం, వ్యవసాయకాల్వ భూమిని కాపాడాలి. కోట్ల విలువైన ఆలయ భూమితోపాటు నాలా స్థలం, రోడ్డు స్థలాన్ని ఆక్రమించి ప్లాటింగ్ చేసున్నారు. – గడ్డం కిరణ్

స్టాఫ్‌నర్స్ పోస్టులు ఇప్పించాలి



జిల్లా జనరల్ హాస్పిటల్, వేములవాడ ఏరియా ఆస్పత్రులలో స్టాఫ్‌నర్సుల పోస్టులు ఇప్పించాలి. మేము గత నాలుగేళ్లుగా సిరిసిల్ల, వేములవాడ ఆస్పత్రుల్లో స్టాఫ్‌నర్స్‌లుగా ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేశాం. కోవిడ్-19 సీజన్‌లో సేవలందించాం. ఇప్పుడు జనరల్ ఆస్పత్రిలో రెగ్యులర్ స్టాఫ్ రావడంతో మమ్మల్ని తొలగించారు. మా 13 మందికి పోస్టులు ఇప్పించాలి. – నిరుద్యోగ నర్సులు

నాడు సింహగర్జన.. నేడు కదనభేరి

- గులాబీమయమైన కరీం'నగరం'
- లక్ష మంది సమీకరణకు ఏర్పాట్లు
- నేడు కేసీఆర్ రాక



కరీంనగర్ ఎస్సారార్ కళాశాల గ్రౌండ్‌లో కదనభేరీ సభ

సాక్షిప్రతినిధి,కరీంనగర్/కరీంనగర్: దశాబ్దాలపాటు తెలంగాణ ప్రజలు కోరుకున్న స్వరాష్ట్ర సాధన లక్ష్యంగా ఉద్యమ పార్టీగా పురుడు పోసుకున్న నాటి టీఆర్ఎస్, ప్రస్తుత బీఆర్ఎస్ పార్టీ కలిసొచ్చిన కరీంనగర్ గడ్డపై నుంచే పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టేందుకు సిద్ధమైంది. జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాల గ్రౌండ్‌లో మంగళవారం లక్ష మందితో పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా 'కరీంనగర్ కదనభేరి' పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించి ఎన్నికల ప్రచార శంఖారావం పూరించనున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం చవిచూసిన తర్వాత పార్టీ అధినేత కేసీఆర్ మొదటిసారిగా కరీంనగర్‌కు రానున్న నేపథ్యంలో గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈనెల 7న కరీంనగర్‌లో సమావేశం ఏర్పాటు చేసి సభ ఏర్పాట్లు, కాంగ్రెస్, బీజేపీల వైఖరి, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆవశ్యకతను ప్రజలకు వివరించాలని కోరారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ, బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ కరీంనగర్‌లోనే మకాం వేసి వారం రోజులుగా కార్యకర్తలకు దిశానిర్దేశనం చేశారు.

లక్ష మంది సమీకరణకు..

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని 7 నియోజక వర్గాల నుంచి లక్ష మందికిపైగా జనాన్ని సమీకరించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్, కరీంనగర్, సిరిసిల్లలో బీఆర్ఎస్ విజయం సాధించగా చొప్పదండి, మానకొండూర్, హుస్నాబాద్, వేములవాడలో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. పార్లమెంట్ పరిధిలో వచ్చిన ఓట్లను పరిగణనలోకి తీసుకుంటే కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్‌కే 5వేల పైచిలుకు ఓట్లు అధికంగా వచ్చిన విషయాన్ని కార్యకర్తలకు వివరిస్తూ భరోసా నింపే ప్రయత్నం చేస్తున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు 5,12,352 ఓట్లు రాగా బీఆర్ఎస్‌కు 5,17,601, బీజేపీకి 2,50,400 ఓట్లు వచ్చాయని, పార్లమెంట్ పరిధిలో అసెంబ్లీ సీట్ల సంఖ్య తగ్గినా 5 వేల పైచిలుకు మెజార్టీ బీఆర్ఎస్‌కే ఉందని, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేస్తే గెలుపు తథ్యమనే వాదనను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం బీఆర్ఎస్ చేస్తుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 3 నెలలు గడిచాయని, వారు ఇచ్చిన హామీలు అమలు కాక ప్రజలు అసహనంతో ఉన్నారని, బీజేపీ ఎంపీ బండి సంజయ్ ఐదేళ్లల్లో చేసిన అభివృద్ధి పెద్దగా ఏమీ లేదనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి మరోసారి ఎంపీ సీట్లను బీఆర్ఎస్ కైవసం చేసుకునే దిశగా కార్యకర్తల్లో మనోనిబ్బరాన్ని నింపుతున్నారు.

ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంచాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



ఆస్పత్రిని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

సిరిసిల్ల: ప్రభుత్వ వైద్యంపై నమ్మకాన్ని పెంచాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ కోరారు. జిల్లా ఆస్పత్రిని సోమవారం సందర్శించిన సందర్భంగా మాట్లాడారు. సర్కార్ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచడంతో పేదలకు ఆర్థికంగా మేలు చేసినట్లు అయిందన్నారు. విద్య, వైద్యంపై ఎక్కువ దృష్టిసారించడం ద్వారా పేదలకు సేవ చేసినట్లు అవుతుందని పేర్కొన్నారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. సిబ్బంది పెంపు కోసం కృషి చేస్తానన్నారు. సర్కారు వైద్యంపై నమ్మకాన్ని మరింత పెంచాలని కోరారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ మురళీధర్‌రావు, డిప్యూటీ పర్యవేక్షకులు డాక్టర్ సంతోష్‌కుమార్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రంజాన్‌కు సౌకర్యాలు కల్పించండి

సిరిసిల్లకల్చరల్: రంజాన్ మాసంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రార్థన స్థలాలు, మసీదుల వద్ద సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో సోమవారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ముస్లిం నేతలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ మాట్లాడుతూ ముస్లింల ఉపవాసాలు, ప్రత్యేక ప్రార్థనల నేపథ్యంలో మసీదుల దగ్గర ప్రతి రోజు పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఖబ్రస్థాన్‌ల వద్ద మొరం పోయించాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, పట్టణాలు, గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఇన్‌చార్జి అధికారి రాధాబాయి, వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, పౌర సరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, ఓఎస్డీ సురేమియా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యాలయాలకు ఉచిత విద్యుత్ మంచి నిర్ణయం

- టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి



సిరిసిల్లఎడ్యుకేషన్: ప్రభుత్వ విద్యాలయాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని, పాఠశాలల్లో సర్వీస్ పర్సన్స్ నియమిస్తామని ఉద్యోగులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షనీయమని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని శివనగర్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 2016 తర్వాత ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో సీఎం ఇలాంటి సమావేశం నిర్వహించడం తొలిసారి అని పేర్కొన్నారు. విద్యాభివృద్ధి సలహాలను ఆహ్వానించడంతోపాటు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుమాల రమానాథ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పురం వాసుదేవరావు, మల్లారపు పురుషోత్తం, సత్తు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని ఆవునూర్‌లో మహిళా బీడీ కార్మికులకు కేంద్ర కార్మిక శాఖ సంచార వైద్యశాల ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మహిళలకు వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు వైద్యాధికారి విక్రమ్ తెలిపారు. కేంద్ర కార్మికశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరాలను బీడీ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్మికశాఖ ద్వారా కార్మికులకు కేంద్రం అందించే పథకాలపై అవగాహన కల్పించామన్నారు. టేకేదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బద్దెపూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విదేశాల్లో విద్యాభ్యాసానికి సర్కార్ చేయూత

సిరిసిల్లకల్చరల్: విదేశాల్లో ఉన్నత విద్యకు ప్రవేశాలు తీసుకున్న ఎస్సీ విద్యార్థులకు ఉద్దేశించిన అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీడీవో వినోద్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, యుఎస్ఏ, యూకే, జర్మనీ, జపాన్, కొరియా, న్యూజిలాండ్ దేశాల్లోని యూనివర్సిటీల్లో పీజీ కోర్సులను అధ్యయనం చేయాలనుకునే ఎస్సీ విద్యార్థులు దరఖాస్తునకు అర్హులుగా పేర్కొన్నారు. రూ.5లక్షల్లోపు వార్షికాదాయం, డిగ్రీలో 60 శాతానికి పైగా మార్కులు, టోఫెల్, జీఆర్ఈ, జీమ్యాట్, ఐఈఎల్‌టీఎస్ పరీక్షల్లో ఉత్తీర్ణులు అర్హులుగా పేర్కొన్నారు. www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపరచాలని సూచించారు.

పావలా వడ్డీ అందేదెప్పుడో?

- స్వశక్తి సంఘాలకు ఐదేళ్లుగా అందని వడ్డీ
- వడ్డీ లేని రుణాలకు ఇంట్రెస్ట్ ఎప్పుడో
- జిల్లాలో వీఎల్ఆర్ మిత్తి రూ.68.66కోట్లు బకాయి
- జిల్లాలో 9,817 స్వశక్తి మహిళా సంఘాలు



స్వశక్తి మహిళలు

ముస్తాబాద్(సిరిసిల్ల): మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం ఇందిరా కాంతి పథం(ఐకేపీ) ద్వారా వడ్డీలేని రుణాలు అందిస్తుంది. ఈ రుణాలు సకాలంలో చెల్లిస్తే పావలా వడ్డీ తిరిగి మహిళా సంఘాల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుంది. గత ఐదేళ్లుగా ఈ పావలా వడ్డీ ప్రభుత్వం మంజూరు చేయడం లేదు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఐదేళ్లకాలంలో రూ.68.66కోట్ల వీఎల్ఆర్ వడ్డీ బకాయి పెరిగిపోయింది. ఈ డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలియక మహిళలకు ఎదురుచూపులు తప్పడం లేదు.

9817 సంఘాలు..

జిల్లాలో 9,817 స్వశక్తి సంఘాలున్నాయి. ఒక్కో సంఘంలో గరిష్టంగా పది మంది చొప్పున సభ్యులు ఉన్నారు. పది సంఘాలకు ఒక గ్రామైక్య సంఘంగా 417 సంఘాలు ఉన్నాయి. జిల్లాలోని గ్రామీణ మహిళల్లో అత్యధికులు వ్యవసాయ కూలీలు, బీడీ కార్మికులే. వీరంతా రుణాలు తీసుకొని ప్రతీ నెల చెల్లిస్తున్నారు. ప్రభుత్వం వీరికి రావాల్సిన పావలా వడ్డీ ప్రోత్సాహం అందడం లేదు. ఒక్కో సభ్యురాలికి కనీసం రూ.5వేల నుంచి రూ.10వేల వరకు రావాల్సి ఉంది. జిల్లాలో 255 గ్రామాల్లో 9,817 సంఘాలు ఉండగా, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాల్టీల్లో 2వేల సంఘాలు ఉన్నాయి.

వీఎల్ఆర్ పెండింగ్ ఇలా..

మండలం	పెండింగ్ అమౌంట్(కోట్లలో)
బోయినపల్లి	రూ.5.75
చందుర్తి	రూ.4.79
ఇల్లంతకుంట	రూ.8.49
గంభీరావుపేట	రూ.8.04
కోనరావుపేట	రూ.5.60
ముస్తాబాద్	రూ.8.24
రుద్రంగి	రూ.1.94
తంగళ్లపల్లి	రూ.8.11
వీర్నపల్లి	రూ.1.92
వేములవాడ అర్బన్	రూ.2.51
వేములవాడ(ఆర్)	రూ.3.62
ఎల్లారెడ్డిపేట	రూ.9.59

లక్ష చెల్లించినా వడ్డీ రాలే..



నేను లక్ష రుణం తీసుకున్న. ప్రతి నెల క్రమం తప్పకుండా కిస్తీలు చెల్లించిన. రుణం మొత్తం కట్టిన కూడా పావలా మిత్తీ పైసలు రాలేదు. ఐదేళ్లుగా ఇస్తలేరు.

– నుంచు సునంద, ముస్తాబాద్

ప్రతీ నెల చెల్లించాం



మహిళా సంఘాలలో తీసుకున్న రుణాలను ఎలాంటి పొరపాటు లేకుండా ప్రతీ నెల కిస్తీలు చెల్లించినం. ఐదేళ్లుగా సంఘాలకు రావాల్సిన పావలా బకాయి పైసలు రాలేదు. ఐకేపీ సార్లను మహిళలు ప్రతీ సమావేశంలో అడుగుతున్నాం.

– లక్ష్మి, ముస్తాబాద్

అధికారులకు నివేదించాం



స్వశక్తి సంఘాల వడ్డీ లేని రుణాలకు సంబంధించిన ఇంట్రెస్ట్ నివేదికలను ఉన్నతాధికారులకు అందజేశాం. ఏడేళ్ల క్రితం ఒకసారి పావలా వడ్డీ వచ్చింది. దాన్ని మహిళలకు పంపిణీ చేశాం. ఇంకా బకాయిలు ఉన్నాయి.

– దేవరాజు, ఏపీఎం

సమస్యలు పరిష్కరించండి



సిరిసిల్లలో వినతిపత్రం ఇస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు



ఆది శ్రీనివాస్ పీఎస్ గోలి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

సిరిసిల్లటౌన్: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉంటున్న గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం రమణ కోరారు. జిల్లా వ్యాప్తంగా జీపీ కార్మికులు సోమవారం సిరిసిల్లలో నిరసన తెలిపారు. ఎమ్మెల్యే కేటీఆర్ క్యాంపు ఆఫీస్‌ను ముట్టడించారు. జీపీ వ్యవస్థలో మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, కార్మికులను శ్రమదోపిడీ నుంచి విముక్తులు చేయాలని డిమాండ్ చేశారు. లింగంపల్లి కృష్ణవేణి, బుర్ర శ్రీనివాస్, మల్లయ్య, శ్రీనివాస్, నర్సయ్య, అంజయ్య, భిక్షపతి, రవీందర్ పాల్గొన్నారు.

వేములవాడ: గ్రామపంచాయితీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ వేములవాడలో సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు సోమవారం ర్యాలీ తీశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పీఎస్ గోలి శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్లు తదితర పనులన్నీ పంచాయతీ కార్మికులే చూసుకుంటున్నారన్నారు. ఇన్ని పనులు చేస్తున్న తమకు ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, నాయకులు గురజాల శ్రీధర్, గ్రామపంచాయతీ కార్మిక జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, కార్మికులు మల్లయ్య, మహేశ్, చరణ్, ఎడెల్లి అంజలి, గంగాజల, రాజు, లక్ష్మయ్య, మల్లారం గంగరాజు, సుమన్ పాల్గొన్నారు.

అప్పులు చేసినా దక్కని ప్రాణం

- నరాల వ్యాధితో ఆస్పత్రిలో చేరిన చేనేత కార్మికుడు
- చికిత్స పొందుతూ మృతి
- చందాలతో అంత్యక్రియలు



లింగమూర్తి(ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితి ఆ చేనేత కుటుంబానిది. హోటల్ నిర్వహించుకుంటూ భార్యపిల్లలను పోషించుకుంటున్న అతడు ఎవరికీ రాని అరుదైన వ్యాధికి గురయ్యాడు. చికిత్స కోసం ఆస్పత్రిలో చేరగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కోనరావుపేట మండలం మామిడిపల్లికి చెందిన మ్యాన లింగమూర్తి(45) గ్రామంలోనే హోటల్ నడుపుకునేవాడు. కొన్ని రోజుల క్రితం నరాలకు సంబంధించిన వ్యాధికి గురయ్యాడు. కాళ్లు, చేతులు పనిచేయకపోవడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి చాలా అరుదుగా వచ్చే మయాస్థీనియా గ్రేవిస్ అనే వ్యాధిగా నిర్ధారించారు. ఆస్పత్రిలో జీవచ్ఛవంలా ఉన్న అతనికి వైద్యులు చికిత్స అందించారు. ఆరోగ్యశ్రీ కార్డు పనిచేయదని చెప్పడంతో రోజుకు రూ.20వేలు అప్పులు చేసి వైద్యం అందించారు. నిరుపేద కుటుంబం కావడంతో వైద్యం కోస అప్పులు తెచ్చి గత 20 రోజులుగా రూ.4లక్షలు ఖర్చు పెట్టారు. చికిత్స పొందుతున్న లింగమూర్తి సోమవారం మృతి చెందాడు. గ్రామస్తులు విరాళాలతో అంత్యక్రియలు నిర్వహించారు. లింగమూర్తి భార్య లత, కుమారులు శివప్రసాద్, శ్రీపద్‌లను మాజీ సర్పంచ్ కొక్కుల భారత, ఎంపీటీసీ మిర్యాల ప్రభాకర్‌రావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా తదితరులు పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

ఉపాధిహామీ కూలీలపై అడవిపందుల దాడి

- కందకాలు తవ్వుతున్న ముగ్గురు కూలీలకు గాయాలు
- వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలింపు



చందుర్తి(వేములవాడ): రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం నర్సింగాపూర్‌కు చెందిన ఇద్దరు ఉపాధిహామీ కూలీలపై అడవి పందులు దాడి చేసి గాయపర్చాయి. నర్సింగాపూర్‌కు చెందిన ఉపాధిహామీ కూలీలు లొంక హనుమండ్లు అటవీ ప్రాంతంలో కందకాలను తవ్వేందుకు 60 మంది కూలీలు వెళ్లారు. కందకాలు తవ్వుతున్న సమయంలో పందులు గుంపుగా రావడంతో భయపడిన కూలీలు పరుగులు తీశారు. ఇదే సమయంలో పలువురు మహిళలపై పందులు దాడి చేయడంతో బైరగోని శంకరవ్వ, ఆరెల్లి నర్సవ్వ, ఆరెల్లి లచ్చవ్వలకు గాయాలయ్యాయి. వెంటనే వేములవాడ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. తీవ్రంగా గాయపడిన శంకరవ్వను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఉపాధిహామీ ఏపీవో రాజయ్య మాట్లాడుతూ స్వల్ప గాయాలైనట్లు తెలిపారు.

చెరువులో పడి పశువుల కాపరి మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాగినేడు పెద్దచెరువులో ప్రమాదవశాత్తు పడి పశువుల కాపరి రేవెళ్లి రాయమల్లు (34) మృతి చెందాడు. ఏఎస్సై రామస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జూలపల్లి మండలం కాచాపూర్‌కు చెందిన రాయమల్లు బసంత్‌నగర్‌కు చెందిన బరిగెల రాములు పశువులను కాసేందుకు పని కుదుర్చుకున్నాడు. సోమవారం పశువులను మేతకు తీసుకెళ్లిన రాయమల్లు వాటికి నీరు తాగించేందుకు చెరువులోకి దింపే క్రమంలో తాను చెరువులోకి దిగి మృతిచెందాడు.

ఆయన అవయవాలు సజీవం

- ప్రమాదంలో విలాసాగర్ వాసి మృతి
- సిరిసిల్లలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు
- అవయవ దానం చేసిన కుటుంబీకులు
- తండ్రి చితికి నిప్పంటించిన కూతురు



తండ్రి చితికి నిప్పు పెడుతున్న కూతురు



అంజయ్య(ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): చనిపోయిన తన అవయవాలు దానం చేసి పలువురిలో బతికే ఉన్నాడు జిల్లాకు చెందిన ఓ హెడ్‌కానిస్టేబుల్. గ్రామస్తులు తెలిపిన వివరాలు. బోయినపల్లి మండలం విలాసాగర్‌కు చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ గంగాధర అంజయ్య(50) సిరిసిల్లలో ఫింగర్‌ప్రింట్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 2వ తేదీన విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై సిరిసిల్ల వెళ్తున్నాడు. వేములవాడ మండలం సంకెపల్లి పరిసరాల్లో బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో అంజయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. పది రోజులుగా మృత్యువుతో పోరాడిన అంజయ్య ఈనెల 10న బ్రెయిన్‌డెడ్ అయ్యాడు. అంజయ్య అవయవాలు గుండె, లివర్, కిడ్నీలు, కళ్లు, ఊపిరితిత్తులను యశోద ఆస్పత్రిలో కుటుంబీకులు దానం చేశారు. సోమవారం విలాసాగర్‌లో అంజయ్య అంత్యక్రియలు నిర్వహించారు. అంజయ్యకు భార్య పద్మ, కూతుళ్లు ప్రియాంక, ప్రహర్ష ఉన్నారు. కాగా పెద్ద కూతురు ప్రియాంక సివిల్స్ ప్రిపేర్ అవుతుండగా, రెండో కూతురు ప్రహర్ష బీటెక్ పూర్తి చేసి అమెరికాలో చదువుకుంటోంది. ప్రమాదం విషయం తెలిసి ప్రహర్ష అమెరికా నుంచి స్వగ్రామం వచ్చింది. కాగా తండ్రి చితికి పెద్ద కూతురు ప్రియాంక నిప్పు పెట్టింది. అంజయ్య అంత్యక్రియల్లో వేములవాడ ఏఆర్ డీఎస్పీ గంగాధర్, బోయినపల్లి ఎస్సై ఎల్.శ్రీకాంత్ పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సమన్యాయం

- దశలవారీగా అభివృద్ధి పనులు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ప్రొసీడింగ్స్ అందిస్తున్న ప్రభుత్వ విప్ శ్రీనివాస్

వేములవాడరూరల్: అన్ని వర్గాలకు సమన్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడరూరల్ మండలం ఎదురుగట్ల, చెక్కపల్లి, నూకలమర్రి, నమిలిగుండుపల్లి, ఫాజుల్‌నగర్, వట్టెంల గ్రామాలకు ప్రత్యేక నిధులతో మహిళా సంఘ భవనాలు, సీసీ రోడ్లు, కులసంఘ భవనాలు, ఇతర అభివృద్ధి పనులకు సోమవారం భూమిపూజ చేశారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా గ్రామాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మూడు నెలల్లోనే హామీలు అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదన్నారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, వట్టెంల ఎంపీటీసీ రంగు వెంకటేశ్‌గౌడ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సోయినేని లహరి, కరుణాకర్, బొడ్డు రాములు, సంగ స్వామియాదవ్ ఉన్నారు.

వినియోగదారులకు 'కరెంట్' కష్టాలు



సిరిసిల్ల మున్సిపల్ ఆఫీస్ వద్ద 'గృహజ్యోతి' కోసం క్యూ కట్టిన పట్టణ ప్రజలు

- 'గృహజ్యోతి'లో జీరో బిల్లు రాక ఆందోళన
- మున్సిపల్ ఆఫీస్‌కు వెల్లువెత్తిన దరఖాస్తులు

సిరిసిల్ల: జిల్లా కేంద్రం వాసులకు 'కరెంట్' కష్టాలు ఎదురయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అమలు చేస్తూ 'గృహజ్యోతి' పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకంలో జీరో విద్యుత్ బిల్లులు రాని వినియోగదారులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కొత్త కరెంట్ బిల్లు, ప్రజాపాలన దరఖాస్తు ఫారమ్‌తో వచ్చి సిరిసిల్ల మున్సిపల్ ఆఫీస్‌లో దరఖాస్తు చేస్తున్నారు. సెస్ సిబ్బంది క్షేత్రస్థాయిలో ఆధార్, రేషన్ కార్డుతో కరెంట్ మీటరు నంబరును లింకు చేసిన సందర్భంగా అందుబాటులో లేని వారు కొందరైతే.. అందుబాటులో ఉన్నా.. వివరాల నమోదులో తప్పులు దొర్లి జీరో బిల్లు రాకపోవడంతో వినియోగదారులు ఇలా సిరిసిల్ల మున్సిపల్ ఆఫీస్‌కు సోమవారం వచ్చి క్యూ కట్టి మరీ దరఖాస్తులు అందించారు. పక్కింటి వారికి, అద్దెకు ఉండే వారికి జీరో బిల్లు రాగా.. తమకు ఎందుకు రావడం లేదనే ఆలోచనతో ఒక్కసారిగా దరఖాస్తులు వెల్లువెత్తడం విశేషం.

సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు విక్రమార్క, పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులకు ఫిట్‌మెంట్, మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి హామీలను నిలబెట్టుకుంటున్నారన్నారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, ఎంపీటీసీ శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, డీసీసీ ఉపాధ్యక్షుడు బుర్రరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శులు మిర్యాల్‌కార్ శ్రీనివాస్, పెద్దిగారి శ్రీనివాస్, కొండం రాజిరెడ్డి, రాంరెడ్డి, కొండల్‌రెడ్డి, తలారి నర్సింలు, సత్యంగౌడ్, శీల ప్రశాంత్, దీటి నర్సింలు, నరేశ్, కిషన్‌రావు, అంజన్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, ధర్మేందర్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



స్వీట్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గంభీరావుపేట(సిరిసిల్ల): ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు 21శాతం ఫిట్‌మెంట్ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం సంబురాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు హమీద్, జిల్లా ప్రధాన కార్యదర్శి మూల రాంచంద్రారెడ్డి, జిల్లా నాయకులు వంగ రాఘవేందర్‌రెడ్డి, రాజుగౌడ్, తాజొద్దీన్, లచ్చయ్య, శంకర్, ప్రభాకర్, జంగం రాజు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో హంతకులు?

సిరిసిల్లక్రైం: వీర్నపల్లి మండలం వన్‌పల్లిలో వివాహితను హత్యచేసిన ఘటనలో ఇద్దరు పట్టుబడినట్లు తెలిసింది. వీర్నపల్లి మండలం వన్‌పల్లికి చెందిన శివరాత్రి మల్లవ్వ(42) మూడు రోజుల క్రితం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. భర్త అనారోగ్యంతో ఒక ఊరిలో, కొడుకు కుటుంబ పోషణకు మరో ఊరిలో ఉంటుండగా మల్లవ్వ వన్‌పల్లిలోని ఇంటిలో ఒంటరిగా నివసిస్తుంది. రోజు మాదిరిగానే గత శనివారం ఇంటిలో నిద్రించగా మరుసటి రోజు ఆదివారం రక్తపుమడుగులో చనిపోయి కనిపించింది. ఎవరో హత్య చేసి ఉంటారని స్థానికులు, కుటుంబీకులు అనుమానించారు. ఈ కోణంలోనే పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులకు అందిన ప్రాథమిక సమాచారం మేరకు ఇద్దరు వ్యక్తులు ఒంటరిగా నిద్రిస్తున్న మహిళను హత్య చేసినట్లు అంచనాకు వచ్చినట్లు సమాచారం. హంతకులను అదుపులోకి తీసుకుని నేడో, రేపో మీడియా ఎదుట ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ విషయాన్ని ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌ను వివరణ కోరగా కేసు దర్యాప్తులో ఉందని, హంతకుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.



భగీరథ ప్రయత్నం

ముస్తాబాద్(సిరిసిల్ల): పాతాళంలోని గంగమ్మను పైకి తెచ్చి పంటలను కాపాడుకునేందుకు జిల్లాలోని రైతులు భగీరథ ప్రయత్నాలే చేస్తున్నారు. అడుగంటిన భూగర్భ జలాలతో బోరుబావుల్లోని నీరు మరింత లోతుకు పోవడంతో ఆ నీటిని పైకి తెచ్చేందుకు పైపులు వేస్తున్నారు. ముస్తాబాద్ మండలం పోతుగల్‌కు చెందిన జంగ తిరుపతి మూడెకరాలలో వరి సాగు చేశాడు. బోరుబావిలోంచి నీరు రాకపోవడంతో మెకానిక్‌ను పిలిపించి మరో 20 పైపులు లోనికి దించాడు. అప్పటికీ నీళ్లు రాకపోవడంతో మరో మూడు పైపులు వేసి నీటిని పైకి తెప్పించి, పంటకు పదుతున్నాడు. ఇందుకు రూ.10వేల వరకు ఖర్చు చేశాడు. ఇలాంటి రైతులు జిల్లాలో చాలా మందే ఉన్నారు.